దోమల నివారణకు స్పెషల్ డ్రైవ్

- ఎల్బీ నగర్ జోన్ వ్యాప్తంగా సెప్టెంబర్ 1 నుంచి కార్యక్రమాలు
- అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలి..
- చెరువులు, కుంటల్లో క్లీనింగ్
- కాలనీల్లో , బస్తీల్లో ఫాగింగ్..
- సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రత్యేక చర్యలు..
- జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్



ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, చిత్రంలో సీనియర్ ఎంటమాలజిస్ట్ రజినీ

ఎల్బీనగర్, ఆగస్టు 28 : దోమల నిర్మూలన, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నుంచి రక్షణ చర్యల గురించి ప్రజలకు వివరించేందుకు ఎల్బీనగర్ జోన్ వ్యాప్తంగా సెప్టెంబర్ 1నుంచి పది రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. బుధవారం ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో సీనియర్ ఎంటమాలజిస్ట్ రజినీతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దోమల నిర్మూలనకు ఎల్బీనగర్ జోనల్ వ్యాప్తంగా ప్రస్తుతం చేపడుతున్న కార్యక్రమాలకు అదనంగా పది రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించబోతున్నామని అన్నారు. జోన్ పరిధిలోని కాప్రా, ఉప్పల్, హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్లలోని 23 డివిజన్లలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం జరుగుతుందన్నారు. దోమల ద్వారా వ్యాపిస్తున్న డెంగీ వ్యాధితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ డెంగీ దోమ లు మంచినీటిలో పుడుతున్నందున ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి.. తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గత ఏడాది ఎల్బీనగర్ జోన్‌లో డెంగీ కేసులు 78 నమోదు కాగా ఈ ఏడాది 74 మంది డెంగీ బారిన పడ్డారని అన్నారు. గత మూడు సంవత్సరాల్లో ఎల్బీనగర్ జోన్‌లో డెంగీతో ఎవ్వరూ మరణించలేదన్నారు. డెంగీ సోకినట్లుగా సమాచారం అంది న వెంటనే ఆయా ప్రాంతాలను గుర్తించి పరిసరాల్లోని వంద నివాసాల్లో పారిశుధ్య కార్యక్రమంతోపాటుగా ఆంటీ లార్వా ఆపరేషన్స్ చేపడుతున్నామన్నారు. ఎల్బీనగర్ జోనల్ పరిధిలోని కాప్రా, ఉప్పల్ సర్కిళ్లు, హయత్‌నగర్, సరూర్‌నగర్ సర్కిళ్ల పార్ట్ మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా పరిధిలోకి, హయత్‌నగర్, ఎల్బీ నగర్, సరూర్‌నగర్ సర్కిళ్లు రంగారెడ్డి జిల్లా పరిధిలోకి వస్తాయని ఆయా విభాగాలతో కలిసి డీఎంహెచ్‌ఓల సమన్వయంతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. చెరువులు, కుంటల క్లీనింగ్‌తో పాటుగా దోమల ఆవాసాలు లేకుండా తగు చర్యలు తీసుకోవడం తో పాటు కాలనీల్లో , బస్తీల్లో రెగ్యూలర్‌గా ఫాగింగ్, ఆంటీ లార్వా ఆపరేషన్‌ను మానిటరింగ్ చేస్తున్నామన్నారు. జోన్ వ్యాప్తంగా ప్రస్తుతం ప్రతి సర్కిల్‌కు రెండు ఫాగింగ్ యం త్రాలు, ప్రతి డివిజన్‌కు రెండు ద్విచక్ర వాహనాలతో ఫాగింగ్ జరుగుతుందన్నారు. జోన్ వ్యాప్తంగా 436 మంది ఎంటమాలజీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, వీరిలో సర్కిల్‌కు ఒక ఏఈ చొప్పున 5 మంది ఏఈలు, జోన్ వ్యాప్తంగా 20 మంది సూపర్‌వైజర్లు విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రత్యేక శానిటేషన్, దోమల నివారణ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం సెప్టెంబర్ 1న కాప్రా సర్కిల్ లో ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. ప్రజలు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో ఈ స్పెషల్ డ్రైవ్‌ను విజయవంతం చేస్తామని ఆయన తెలిపారు.

మలక్‌పేట సబ్ డివిజన్ జలమండలి డీజీఎం అభిలాష్ బదిలీ

మలక్‌పేట, ఆగస్టు 28 : మలక్‌పేట సబ్ డివిజన్ జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్(డీజీఎం) ఎన్.అభిలాష్ బదిలీ అయ్యారు. నెల రోజులక్రితం ప్రాజెక్ట్ కార్యాలయం నుంచి బదిలీపై మలక్‌పేటకు వచ్చిన ఆయన, శుంకిశాల ప్రాజెక్ట్‌కు బదిలీ కావడం చర్చనీయాంశమైంది. వినయ్‌నగర్ జలమండలి సబ్ డివిజన్ డీజీఎం నాగరాజును మలక్‌పేట ఇన్‌చార్జి డీజీఎంగా నియమించగా బాధ్యతలు చేపట్టారు.

సౌత్‌జోన్ సర్కిల్-6 టౌన్ ప్లానింగ్ ఏసీపీగా గజానంద్

మలక్‌పేట, ఆగస్టు 28: సౌత్‌జోన్ సర్కిల్-6 మలక్‌పేట నియోజకవర్గ పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీగా గజానంద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. మొన్నటి వరకు ఇక్కడ సర్కిల్-6 ఏసీపీగా పనిచేసిన ఫర్హాద్ వరంగల్‌కు బదిలీ అవగా, ఆయన స్థానంలో ఎల్‌బీనగర్ సర్కిల్‌లో ఏసీపీగా పనిచేసిన గజానంద్ బదిలీపై మలక్‌పేటకు వచ్చారు.

అధికారులకు శుభాకాంక్షలు

చంపాపేట, ఆగస్టు 28: సివిల్ సప్లై విభాగంలోని అధికారుల సేవలను గుర్తించి వారికి ప్రభుత్వం పదోన్నతులు కల్పించడం గర్వకారణమని రేషన్ డీలర్ల సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొక్కొండ వైకుంఠం గుప్తా అన్నారు. సివిల్ సప్లై రంగారెడ్డి జిల్లా అధికారి మనోహర్ కుమార్ రాథోడ్ రాష్ట్ర సివిల్ సప్లై విభాగం హైదరాబాద్ జాయింట్ కమిషనర్‌గా పదోన్నతిపై వెళ్లడంతో, వారి స్థానంలో గంప శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కొక్కొండ వైకుంఠం గుప్తా ఆధ్వర్యంలో బుధవారం అధికారులను వేరు, వేరుగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ సూర్యప్రకాశ్ గుప్తా, యాదగిరి, మల్లికార్జున్ గౌడ్, రమేశ్‌గుప్తా, రాజశేఖర్, వివేక్, సంపత్‌కుమార్, కృష్ణారెడ్డి, రాంప్రకాశ్‌రెడ్డి , ఉపేందర్ పాల్గొన్నారు.



మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చెరువులను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

చెరువుల కబ్జాపై ఆగ్రహం

- మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో చెరువులను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్
- చెరువుల పూర్తి సమాచారం లేకపోవడంపై అధికారులపై అసహనం
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని కార్పొరేటర్ల ఫిర్యాదు

బడంగ్‌పేట, ఆగస్టు 28 : చెరువులు ఆక్రమణకు గురవుతుంటే రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు ఎంచేస్తున్నారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చందన చెరువు, మంత్రాల చెరువు, పెద్ద చెరువు, సర్వే నంబర్ 119లో ఉన్న ప్రభుత్వ భూమిని బుధవారం ఆయన పరిశీలించారు. కబ్జాలపై స్థానికులు, కార్పొరేటర్లు ఫిర్యాదులు చేస్తే ఎందుకు పట్టించుకోవడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ అడిగిన ప్రశ్నలకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నీళ్లు నమిలారు. చందన చెరువు పరిధిలో ఉన్న ఎస్‌వైఆర్ గార్డెన్‌ను పరిశీలించి.. ఇది పూర్తిగా ఎఫ్‌టీఎల్ పరిధి లో ఉన్నట్టు గుర్తించి.. సరిహద్దులను చూశారు. చెరువు భూమి కాకుండా దళితులకు ఇచ్చిన మూడు ఎకరాల చెరువు శిఖం భూమి ని కూడా కబ్జా చేశారని కార్పొరేటర్ బైగల్ల బాలమణి హైడ్రా కమిషనర్‌కు వివరించారు. ఫంక్షన్‌హాల్‌కు సంబంధించిన పూర్తి డాక్యుమెంట్లు తీసుకురావాలని, అసలు చెరువులో ఎవరు అనుమ తి ఇచ్చారని ప్రశ్నించారు. ప్రస్తుతం చెరువుల విస్తీర్ణం ఎంత ఉందని, ఎన్నిఎకరాలు కబ్జా అయిందని అధికారులను అడిగారు. చెరువుల పూర్తి వివరాలు లేకపోవడంతో అధికారులు తడబడ్డారు. అధికారులు ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఈ పద్ధతి మంచిది కాదన్నారు. అధికారుల తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. కార్పొరేటర్లు లీలా రవినాయక్, ఇంద్రావత్ రవినాయక్, సౌందర్య విజయ్ కుమార్, నాయకులు చప్ప శ్రావణ్‌కు మార్లు హైడ్రా కమిషనర్‌కు దగ్గర ఉండి కబ్జా స్థలాలను, మీర్‌పేట చెరువును చూపించారు. శ్మశాన వాటిక కబ్జా, సర్వే నం.119లో భూమిని కబ్జా చేసి దొంగ పాసు పుస్తకాలు తయారు చేశారని వివరించారు. పెట్రోల్ బంక్‌లు, షాపింగ్ మాల్స్ బఫర్, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు గుర్తించారు. మంగళవారంలోపు మీర్‌పేటలో ఉన్న చెరువుల కబ్జాల జాబితాను తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రస్తుతం చెరువు విస్తీర్ణం, ఎంత కబ్జా అయిందన్న వివరాలను తీసుకురావాలని.. లేదంటే సదురు అధికారులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

చెరువులో పర్యటిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, అధికారులు, కార్పొరేటర్లు

సీజనల్ వ్యాధుల బారినపడకుండా ప్రత్యేక చర్యలు

హెల్త్ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ పంకజ

మన్సూరాబాద్, ఆగస్టు 28: ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని హెల్త్ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ పంకజ సూచించారు. నాగోల్‌లో ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించి.. ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడకుండా తీసుకుంటు న్న జాగ్రత్తలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచనలు చేశారు. వైద్య ఆరోగ్య కేంద్రంలో ఓపీ నమోదు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని.. చాలా రోజుల పాటు నిల్వ ఉన్న నీటి నుంచి దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని తెలిపారు. జ్వరాల బారిన పడినవారు వెంటనే సమీపంలోని వైద్య ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి డాక్టర్ల పర్యవేక్షణలో చికిత్స చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఎంటమాలజిస్ట్ రాంబాబు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ పద్మజ, డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, సీనియర్ ఎంటమాలజిస్ట్ రజనీ, తదితరులు పాల్గొన్నారు.

నాగోల్ ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఓపీ నమోదు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న హెల్త్ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ పంకజ

హయత్‌నగర్ ఉప కమిషనర్ తిప్పర్తి యాదయ్య

ఎల్బీనగర్, ఆగస్టు 28 : అంటు వ్యాధు లు ప్రబలకుండా హయత్‌నగర్ సర్కిల్‌లో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని హయత్‌నగర్ ఉప కమిషనర్ తిప్పర్తి యాదయ్య అ న్నారు. బుధవారం హయత్‌నగర్ సర్కిల్ , నాలుగు డివిజన్లలోని నాగోలు గ్రామం, మన్సూరాబాద్ వీకర్‌సెక్షన్ కాలనీ, హయత్ నగర్ గ్రామం, బీఎన్‌రెడ్డినగర్ సచివాలయనగర్‌లోని ప్రాంతాల్లో అంటు వ్యాధులు సోకకుండా అత్యవసర పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉప కమిషనర్ మాట్లాడుతూ.. దోమల నిర్మూలనతో పా టుగా డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇంటింటికి తిరుగుతూ నీటి సంపులు, ట్యాంకులను చెక్ చేశామని, చాలా రోజులుగా నీరు నిల్వ ఉన్న ట్యాంకులను శుభ్రం చేయించామన్నారు. అల్ఫా సైపర్ మాత్రిన్ లిక్విడ్‌ను గోడలకు స్ప్రే చేయడంతో పాటుగా వాటర్ సంపుల్లో టిమోపస్‌ను వేయడం జరిగిందన్నారు. ప్రజలకు ఇండ్లలో దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలని అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ విభా గం ఏఈ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

హయత్‌నగర్ సర్కిల్‌లో అంటు వ్యాధులు ప్రబలకుండా చేపట్టిన ప్రత్యేక చర్యల్లో పాల్గొన్న హయత్‌నగర్ ఉప కమిషనర్ తిప్పర్తి యాదయ్య

తిమ్మాపూర్‌లో నూతనంగా నిర్మించిన దేవాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని ఆశీర్వదిస్తున్న అర్చకులు

ప్రజలు సుఖ శాంతులతో ఉండాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, ఆగస్టు 28 : ప్రజలు సుఖ శాంతులతో ఉండడానికి దైవానుగ్రహం ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మండల పరిధిలోని తిమ్మాపూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో బుధవారం జరిగిన శ్రీ లలిత శివ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలను భగవంతుడు చల్లగా చూడాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాలు నిర్మించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం దేవాలయ కార్య వర్గం.. ఆమెను శాలువాతో సన్మాంచి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గంగాపురం లక్ష్మీనర్సింహా రెడ్డి, మన్నే జయేందర్ ముదిరాజ్, సామ మహేందర్‌రెడ్డి, యూత్ నాయకులు తాళ్ల కార్తిక్, బొక్క దీక్షిత్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, గంగాపురం గోపాల్‌రెడ్డి, సామ ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శోభ ఈశ్వర్‌గౌడ్, యా దగిరి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే.. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తీగల కృష్ణారెడ్డి, కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలను సన్మానించి జ్ఞాపికను ఆందజేశారు. కార్యక్రమంలో చండీ ఉపాసకులు రేవల్లె రాజుశర్మ, ఉపాధ్యక్షులు ఈశ్వర్‌గౌడ్, గంగాపురం అమరేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు గంగాపురం చెన్నకిషన్ రెడ్డి, కోశాధికారి పున్న భిక్షపతి, కార్యవర్గ సభ్యులు సన్నీళ్ల శ్రీరాములు, నర్సింహా, సరికొండ వెంకటేశ్ గౌడ్, పున్న జ్ఞానేశ్వర్, గిరిబాబు, యాదగిరి, జంగయ్య, పవన్‌కుమార్, నాయకులు సత్యనారాయణ, పాండు, ఢిల్లీ శ్రీధర్, పాండుగౌడ్, వెంకటేశ్, ప్రశాంత్‌రెడ్డి, సత్యనారాయణ, గణేశ్, మహేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

వైరల్ జ్వరాలపై అవగాహన కల్పించాలి

సంతోష్‌నగర్ సర్కిల్ డీసీ శైలజ

బస్తీ దవాఖానను సందర్శించిన సంతోష్‌నగర్ సర్కిల్ డీసీ శైలజ

సైదాబాద్, ఆగస్టు 28 : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని జీహెచ్ ఎంసీ సంతోష్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ సిబ్బందికి సూచించారు. బుధవారం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సుబ్రమణ్యంనగర్ కాలనీలోని బస్తీ దవాఖానను సందర్శించి, సిబ్బందితో దవాఖాన నిర్వహణపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ..కాలనీల్లో, బస్తీల్లో క్షేత్రస్థాయిలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశవర్కర్లు పర్యటించి వైరల్ జ్వరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా వైరల్ జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని అవగాహన కల్పించాలన్నారు. దోమల వ్యాప్తిని నివారించడానికి బస్తీల్లో, కాలనీల్లో ఫాగింగ్ చేయాలన్నారు. బస్తీ దవాఖానలో కొనసాగుతున్న ఆరోగ్య సేవలను పర్యవేక్షించడంతోపాటు, వైరల్ జ్వరాలతో వచ్చిన రోగుల వివరాలను సేకరించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌నగర్ సర్కిల్ యూసీడీ ప్రాజెక్టు ఆఫీసర్ రత్నమ్మ, సుబ్రమణ్యంనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నేరెళ్ల ప్రసాద్, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మలక్‌పేట, ఆగస్టు 28: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని చాదర్‌ఘాట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మలక్‌పేట మెట్రో స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి(42) మృతిచెంది ఉండగా.. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటనా స్థలానికి వెళ్లి.. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

పారా క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందేలా కృషి

పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ గౌరవాధ్యక్షుడు ముత్తినేని వీరయ్య

మలక్‌పేట, ఆగస్టు 28: పారా ఒలంపిక్స్ క్రీడాకారులకు హర్యానా ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను రాష్ట్రంలోని పారా క్రీడాకారులకు అందేలా కృషి చేస్తానని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ గౌరవాధ్యక్షుడు ముత్తినేని వీరయ్య తెలిపారు. పారా ఒలంపిక్స్ లో వరల్డ్ చాంఫియన్ షిప్, ఏషియన్ అథ్లెటిక్స్ క్రీడల్లో గోల్డ్ మెడళ్లు సాధించి ప్రపంచ రికార్డును నెలకొల్పిన పారా క్రీడాకారిణి జీవన్ జీ దీప్తి.. సెప్టెంబర్ 2న పారీస్‌లో జరగనున్న పారా ఒలంపిక్స్-2024లో నాలుగు వందల మీటర్ల పరుగు పందెంలో పాల్గొనేందుకు వెళ్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం వీరయ్యను కలిశారు. ఈ సందర్భంగా ఆయన.. జీవన్ జీ దీప్తిని శాలువతో సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడలకు, క్రీడాకారులకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని, పారా క్రీడాకారులకు హర్యానా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి, రాష్ట్రంలోని క్రీడాకారులకు కూడా అందేలా కృషిచేస్తానని తెలిపారు. జీవన్ జీ దీప్తి ఆత్మ విశ్వాసంతో పారా క్రీడల్లో సాధిస్తున్న విజయాలపట్ల సమస్త వికలాంగ సమాజం, పారా అసోసియేషన్ గర్వపడుతుందన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డి సహకారంతో జీవన్ జీ దీప్తికి అన్ని సదుపాయాలు కల్పించి వెన్నంటి ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు సింగారపు బాబు, ప్రధాన కార్యదర్శి గాడిపల్లి ప్రశాంత్, కోశాధికారి నూక రాజు, సలహాదారు సంజీవయ్య, టెక్నికల్ కమిటీ సభ్యులు నరేశ్‌యాదవ్, సైదులు, శ్రీనివాస్‌రెడ్డి, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

పారా క్రీడాకారిణి జీవన్ జీ దీప్తిని సత్కరిస్తున్న పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ గౌరవాధ్యక్షుడు వీరయ్య

కొత్తగూడ, పులిమామిడిలో బోనాలు

కందుకూరు మండల పరిధిలోని కొత్తగూడ, పులిమామిడి గ్రామాల్లో బోనాలు ఘనంగా జరిగాయి. కొత్తగూడలో మూడు రోజుల బోనాల వేడుకల్లో భాగంగా బుధవారం కట్టమైసమ్మ కు బోనాలు సమర్పించారు. కొత్తగూడ గ్రామంలో మాజీ సర్పంచ్ సాధ మల్లారెడ్డి, పులిమామిడిలో వైస్ మాజీ ఎంపీపీ ఆనేగౌని సంధ్య దామోదర్‌గౌడ్, బాలేశ్, శ్రీనివాస్,మాజీ వార్డు సభ్యులు, పాల్గొని పూజలు ర్వహించారు. – కందుకూరు, ఆగస్టు 28

3 నుంచి ఆయుష్‌లో జాతీయ సెమినార్

సైదాబాద్, ఆగస్టు 28 : సైదాబాద్ రెవెన్యూ బోర్డు కాలనీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ హెరిటేజ్ (ఆయుష్) ఆవరణలో వచ్చే నెల 3,4 లలో రెండు రోజులపాటు 'సంప్రదాయ వైద్యంలో ఔషధ అభివృద్ధి' అనే అంశంపై జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ జీపీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సెమినార్‌లో సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేద సైన్స్‌స్ (న్యూ ఢిల్లీ) డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ వైద్య రబీనారాయణ్ ఆచార్య నాయకత్వంలో శాస్త్రవేత్త డాక్టర్ జేసీ బోస్, డాక్టర్ మధుదీక్షిత్ మార్గదర్శకత్వంలో సెమినార్ కొనసాగుతుందని తెలిపారు.

హిందువులు సంఘటితంగా ఉండాలి

కందుకూరు, ఆగస్టు 28 : హిందువులు సంఘటితంగా ఉండాలని అయన్స్ క్లబ్ జిల్లా మొదటి వైస్ గవర్నర్ డాక్టర్ మహేంద్రకుమార్ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ విభాగ్ సంఘటన మంత్రి వెలుగు సాయిలు తెలిపారు. మండల కేంద్రంలోని సీతారామ శాస్త్రీ ఫంక్షన్ హాల్‌లో విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి హిందువుకు వీహెచ్‌పీ వెన్నెముక లాంటిదని తెలిపారు. విశ్వహిందూ బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. ఎన్నో ఉద్యమాలు చేస్తూ హిందువుల కు బాసటగా నిలుస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ప్రఖండ అధ్యక్షుడు ఎగ్గిడి అనిల్, కార్యదర్శి సురేశ్, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజు, ఈశ్వర్, రాంరెడ్డి, ఆర్యవైశ్య సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచకూరి వెంకటేశ్వర్లు గుప్తా, కళ్లెం రాజేందర్‌రెడ్డి, సాధ మల్లారెడ్డి, ఊటు మహేందర్, ఎగ్గిడి సత్తయ్య, రాజేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు. సమావేశం అనంతరం అతిథులను శాలువాలతో సన్మానించారు.

విశ్వహిందూ పరిషత్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మహేంద్ర కుమార్‌రెడ్డి

ఎంబీఏ పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 28: ఓయూ పరిధిలోని ఎంబీఏ పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి వచ్చే సెప్టెంబర్ 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

పీజీఆర్ఆర్‌సీడీఈ పీజీ పరీక్ష తేదీల ఖరారు

ఓయూ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) పరిధిలోని పీజీ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ తదితర కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలను వచ్చే నెల 12 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

ఓయూ పీజీ పరీక్షలు వాయిదా

ఓయూ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల పరీక్షలను వాయిదా వేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్‌కాం, ఎమ్మెస్సీ, ఎమ్‌కాం (ఐఎస్), ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్‌ఐఎస్సీ, ఎంజేఅండ్‌ఎంసీ కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను వచ్చే నెల 4 నుంచి నిర్వహించనున్నట్లు గతంలో ప్రకటించారు. కాగా పలు కారణాల రీత్యా వాటిని వాయిదా వేసినట్లు చెప్పారు